ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
ఆదివారం 2 ఫిబ్రవరి 2025



కొంత ఎక్కువ.. ఎంతో తక్కువ..



- మిశ్రమంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్
- దీర్ఘకాలిక ప్రాజెక్టులకు కానరాని మోక్షం
- కొన్ని పనులకు నిధుల కేటాయింపు
- విమానాశ్రయం, లెదర్ పార్కు ఏర్పాటు దిశగా అడుగులు
- జిల్లాకో కేన్సర్ ఆస్పత్రి ప్రకటనతో ప్రయోజనం
- చిన్నపరిశ్రమలు, స్టార్టప్‌లకు చేయూత
- ఆదాయం పన్ను పరిమితి పెంపుతో హర్షం
- కిసాన్ కార్డు రుణ పరిమితి పెంపుతో ఆనందం
- అసంఘటిత కార్మికులకు వైద్య భరోసా
- నిర్మలమ్మ కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన



మోదం

- మామునూరు విమానాశ్రయం
- లెదర్ పార్కు
- చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు
- రూ.12లక్షల వరకు పన్ను మినహాయింపు
- కిసాన్ క్రెడిట్ కార్డు రుణ పరిమితి పెంపు
- ఆరు జిల్లాల్లో కేన్సర్ ఆస్పత్రుల ఏర్పాటు
- అసంఘటిత కార్మికులకు వైద్య భరోసా

ఖేదం..

- కాజీపేట రైల్వే డివిజన్ ప్రస్తావన కరువు
- కొత్త రైల్వే మార్గాల ఊసే లేదు..
- సైనిక్ స్కూల్ మాటే లేదు..
- కానరాని గిరిజన విశ్వవిద్యాలయం
- మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధులు లేవు
- మేడారం జాతరకు జాతీయ హోదా లేదు
- బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ముచ్చటే లేదు

కేంద్ర బడ్జెట్ - 2025 ఉమ్మడి వరంగల్ జిల్లాకు కొంత మోదం.. కొంత ఖేదం కలిగించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఓరుగల్లు ప్రజలకు పెద్దగా వరాలను ఏమీ కురిపించలేదు. కొన్ని ప్రతిపాదిత పథకాలకు నిధులను కేటాయించి సంతోషపెట్టారు. అయితే దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ప్రస్తావించలేదు. నిధులూ కేటాయించలేదు. రైల్వే పరంగా కొత్త లైన్లు, ప్రాజెక్టులు ప్రకటించలేదు. ఏళ్ల కల అయిన కాజీపేట రైల్వే డివిజన్ ప్రస్తావన లేదు. కోచ్ ఫ్యాక్టరీకి మాత్రం నిధులు ఇచ్చారు. ఇక మెగా టెక్స్‌టైల్ పార్కుకు నిధుల ఊసేలేదు. అలాగే మేడారం జాతరకు జాతీయ హోదా దక్కలేదు. బయ్యారం ఉక్కుఫ్యాక్టరీ ముచ్చటే లేదు. అయితే పేద, మధ్య తరగతి వర్గాలకు మాత్రం కేంద్రం వరాలను కురిపించింది. రైతులకు పెద్ద పీట వేసింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమల వృద్ధికి చేయూతనిచ్చింది. ప్రధానంగా ఆదాయం పన్ను విషయంలో భారీ ఊరటను కల్పించింది. రూ.12లక్షల మేర ఆదాయం వరకు పన్నును మినహాయించింది. దీంతో ఉమ్మడి జిల్లాలో సుమారు 18 లక్షల మంది మధ్యతరగతి వారికి లబ్ధి కలుగనున్నది. విమానాశ్రయాలను అభివృద్ధి చేస్తామనే ప్రకటతో మామునూరు ఎయిర్‌పోర్టుకు అడుగులు పడనున్నాయి. చిన్న పరిశ్రమలకు రాయితీ ప్రకటనతో పరిశ్రమల ఏర్పాటుకు పూల బాట పడనుంది. అలాగే జిల్లాకో కేన్సర్ ఆస్పత్రి ఏర్పాటుతో ఉమ్మడి జిల్లాలో ఆరు ఆస్పత్రులు నిర్మించనున్నారు. అసంఘటిత కార్మికులకు కేంద్రం శుభవార్త చెప్పింది. హెల్త్ కార్డులు అందించి యేటా రూ.5లక్షల వరకు ఆరోగ్య సదుపాయం కల్పించింది. మొత్తంగా కేంద్ర బడ్జెట్ ఉమ్మడి జిల్లా ప్రజలకు కొంత ఆశాజనకంగా ఉన్నట్లు ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

వివరాలు : 8 లో..

ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం జరగనున్న బీసీ యుద్ధభేరి సభకు సిద్ధమవుతున్న ప్రాంగణం



కోటా కోసం కొట్లాట!

నేడు ఓరుగల్లులో బీసీ జంగ్ సైరన్

- ఆర్ట్స్ కాలేజీలో లక్ష మందితో బీసీ యుద్ధభేరి
- పార్టీలకు అతీతంగా ఏకమవుతున్న ప్రజాప్రతినిధులు
- కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం 42శాతం రిజర్వేషన్ కోసం డిమాండ్
- ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల రద్దు, మహిళ రిజర్వేషన్లలో బీసీల వాటా
- బీసీ కోటా తేలాకే స్థానిక ఎన్నికలు పెట్టాలని డిమాండ్
- బీసీ యుద్ధభేరికి జాతీయ నేతలను ఆహ్వానించిన నిర్వాహకులు

8

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- అధికారులు పారదర్శకంగా నిర్వహించాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాబోయే గ్రామపంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు త్వరలో నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఎంపీటీసీ పరిధి చెక్ చేసుకోవాలని, ఎంపీడీవోలు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఎన్నికల సమయంలో సిబ్బంది బాధ్యతలపై స్పష్టమైన ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. ఎన్నికలకు అవసరమగు సిబ్బంది, మెటీరియల్ వివరాలు అందించాలని చెప్పారు. స్థానిక పరిస్థితుల ఆధారంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఎన్నికల వ్యయ పరిశీలనకు అవసరమైన బృందాలు ఏర్పాటు చేసుకుని సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మాచారి, జిల్లా అధికారులు హరిప్రసాద్, పురుషోత్తం, సుబ్బారావు, రవీందర్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్ రాములు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

- ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు పొందేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) దోహదపడుతుందని ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో 14 మందికి రూ.2,59,500 విలువచేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల ఆరోగ్య ప్రదాయినిగా సీఎంఆర్ఎఫ్ నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బోడ శ్రీనునాయక్, బాదె నాగయ్య, అల్లూరి కిషోర్‌శర్మ, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, సూరయ్య, బొమ్మకంటి వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

కేజీబీవీలో నలుగురు విద్యార్థినులకు అస్వస్థత

వేర్వేరు కారణాలతో ఆస్పత్రికి తరలింపు

కేసముద్రం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలం మహమూద్‌పట్నం కస్తూర్బాగాంధీ బాలికల గురుకులంలో శనివారం రాత్రి నలుగురు విద్యార్థినులు వేర్వేరు కారణాలతో అస్వస్థతకు గురయ్యారు. 196 మంది విద్యార్థినులు ఉన్న ఈ పాఠశాలలో సాయంత్రం ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లుసమాచారం అందడంతో స్థానిక ఎస్‌ఐ మురళీధర్‌రాజ్ అక్కడికి వెళ్లారు. వెంటనే 108ను పిలిపించి బాలికలను మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు విద్యార్థినులు కిడ్నీ, మరొకరు గ్యాస్ట్రిక్ నొప్పితో బాధపడుతుండగా ఒకరు మెట్లు దిగుతుండగా కిందపడడంతో గాయపడినట్లు 108 సిబ్బంది తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఈవో యాదగిరి జిల్లా ఆస్పత్రిలో విద్యార్థినులను పరామర్శించారు.

'బీసీ గర్జనను విజయవంతం చేయాలి'

తొర్రూరు, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి) : బీసీ రాజకీయ యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కూరపాటి రమేష్, జిల్లా సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి అన్నారు. శనివారం తొర్రూరులో హలో బీసీ చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరించి వారు మాట్లాడారు. రాజకీయ రంగంలో ప్రతీ ఒక్కబీసీ ముందడుగు వేసి రాజకీయ పగ్గాలు చేపట్టాలని, రాజకీయంగా, ఆర్థికంగా వెనకబడిన బీసీలను గుర్తించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రక్షణ కోసం అట్రాసిటీ చట్టం తేవాలని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇంక్రిమెంట్‌లు చెల్లించి కులవృత్తులను పరిశ్రమలుగా గుర్తించాలని వారు కోరారు. బీసీ హక్కుల సాధన కోసం ఉద్యమం వరంగల్ నుంచే ఆరంభమవుతుందని, ఈ సభకు ప్రతీ ఒక్క బీసీ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు తాళ్లపల్లి రమేష్, కుర్ర శ్రీను, దీకొండ శ్రీను, ఎనగందుల సంతోష్, ఎస్.పి.పాణి, సుధాకర్, సాంబయ్య, అశోక్, వెంకన్న, వెంకటేశ్వర్లు, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి

- రాష్ట్ర ముఖ్యఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

మహబూబాబాద్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి) : శాసనమండలి సభ్యుల ఎన్నికలు సజావుగా జరిగేలా.. కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్యఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలపై ఉన్నతాధికారులతో కలిసి శనివారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందని చెప్పారు. ఈ నేపథ్యంలో జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి కట్టుదిట్టంగా అమలు చేయాలని, రాజకీయ పార్టీలకు సంబంధించిన గోడరాతలు, జెండాలు, ప్రకటనలు తొలగించాలని సూచించారు. శాసనమండలికి సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 3న విడుదల చేయడం జరుగుతుందని, ఆరోజు నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న పరిశీలన, 13 లోపు ఉపసంహరణ ఉంటుందని, 27న పోలింగ్, మార్చి 3న ఫలితాలు వెలువడుతాయన్నారు. తుది ఓటరు జాబితా తయారు చేయాలని సూచించారు. 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రశాంతగా జరిగేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 16 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,658 మంది ఓటర్లున్నారని తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ వీసీలో జిల్లా అదనపు కలెక్టర్లు కె.వీరబ్రహ్మాచారి, అధికారులు పురుషోత్తం, కృష్ణవేణి, హరిప్రసాద్, సుబ్బారావు, మదన్ మోహన్ పాల్గొన్నారు.

'ఎన్‌హెచ్-930పీ అలైన్‌మెంట్‌ను మార్చాలి.. మా భూములను కాపాడాలి'

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌కు రైతుల విజ్ఞప్తి



జాటోతు హుస్సేన్‌నాయక్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న రజాలిపేట, సాలార్‌తండా, ఇల్లందు రోడ్ రైతులు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం నూతనంగా నిర్మించనున్న జాతీయ రహదారి (930పీ) అలైన్‌మెంట్‌ను మార్చి, తమ భూములను కాపాడాలని మహబూబాబాద్ మునిసిపల్ పరిధి రజాలిపేట, సాలార్‌తండా, ఇల్లందురోడ్ రైతులు నీరుటి లక్ష్మీనారాయణ, బాలాజీ, రంజిత్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్‌కు శనివారం వినతిపత్రాన్ని అందించి, సమస్యను వివరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వలిగొండ నుంచి భద్రాచలం వరకు నిర్మించతలపెట్టిన ఎన్‌హెచ్-930పీ నిర్మాణం ప్రారంభించిన సమయంలో మహబూబాబాద్ మునిసిపల్ పరిధి సాలార్‌తండాకు సుమారు 5 కిలో మీటర్ల మేర బయట నుంచి అనంతారం రోడ్డు వరకు అలైన్‌మెంట్ ఉందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొంతమంది పలుకుబడిని ఉపయోగించి పాత అలైన్‌మెంట్‌ను వారికి అనూకూలంగా మార్చుకున్నారని చెప్పారు. ప్రస్తుతం ఉన్న అలైన్‌మెంట్‌తో సాలార్‌తండా వద్ద హనుమాన్‌గుడితో పాటు తండాలోని 400 గృహాలు, వ్యవసాయ భూములను గిరిజన రైతులు కోల్పోనున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాత అలైన్‌మెంట్ ప్రకారం సాలార్‌తండా బయట 5 కిలోమీటర్ల దూరం నుంచి జాతీయ రహదారి నిర్మిస్తే పట్టణం మరింత విస్తరించి అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కొత్త అలైన్‌మెంట్ ద్వారా గిరిజన రైతులు తీవ్రంగా నష్ట పోనున్నారని గిరిజన రైతులకు నష్టం జరగకుండా అందరికీ ఆమోద యోగ్యంగా ఉండే విధంగా జాతీయ రహదారి 930పీ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్ పవార్, రాయురు సురేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణం పాతబజారులోని పలుకాలనీల్లో ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టౌన్-1 ఏఈ సంగీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నందినగర్, గుండ్లకుంట కాలనీ, ఆర్టీసీ కాలనీ, గిరిప్రసాద్‌నగర్, కంకరమిల్లుతండా, ఏటిగడ్డతండా, రాంచంద్రాపురం కాలనీ, ఆర్టీసీ బస్టాండ్‌రోడ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్నేహనగర్, ఆకుల లక్ష్మయ్య కాలనీ, అంబేద్కర్ కాలనీ, ఈదులపూసపల్లి రోడ్డులో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

12న బొడ్రాయి గ్రామదేవత ద్వితీయ వార్షికోత్సవం

- ప్రజలంతా పాల్గొని, విజయవంతం చేయాలి
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు బొడ్రాయి వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న అర్చకులు

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలోని పాతబజారులో శ్రీవేణుగోపాలస్వామి దేవాలయ సమీపాన ప్రతిష్ఠించిన బొడ్రాయి విగ్రహం వద్ద ఈనెల 12న గ్రామ దేవత ద్వితీయ వార్షికోత్సవాన్ని నిర్వహించేందుకు వేద పండితులు నర్సింహామూర్తి ముహూర్తం ఖరారు చేశారు. స్థానిక శ్రీవేణుగోపాల స్వామి దేవాలయంలో శనివారం బొడ్రాయి ప్రతిష్ఠ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో బొడ్రాయి దేవత ద్వితీయ వార్షికోత్సవాన్ని బుధవారం జరుపుకోవాలని నిర్ణయించారు. ఉదయం 5 గంటల నుంచి జలాభిషేకం, స్థలశుద్ధి, గోపూజ, హోమం, గ్రామదేవత వద్ద బోనాల సమర్పణ ఉంటుందని వేదపండితులు తెలిపారు.

'పట్టణ ప్రజలు పూజలో పాల్గొనాలి'

మహబూబాబాద్ పట్టణంలో 12న నిర్వహించే బొడ్రాయి గ్రామ దేవత ద్వితీయ వార్షికోత్సవంలో ప్రజలంతా పాల్గొని, విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ విజ్ఞప్తి చేశారు. ఉదయం నుంచి ప్రారంభమయ్యే పూజల్లో పట్టణ జనమంతా పాల్గొని, పూజలు చేసి, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, అజయ్‌సారథిరెడ్డి, మాలె నాగేశ్వర్‌రావు, ఎడ్ల రమేష్, పిల్లి సుధాకర్, ఆకుల హరిప్రసాద్, చిట్యాల జనార్ధన్, శ్యామ్, ప్రవీణ్, నిమ్మల శ్రీనివాస్, అనుమాండ్ల వెంకటేశ్వర్లు, సదాశివుడు, బోనగిరి గిరిధర్‌గుప్తా, శంతన్‌రామరాజు, పోతురాజు రాజు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి

కేసముద్రం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇంటికన్నెలో శనివారం రాత్రి సైకిల్‌పై వెళుతూ ప్రమాదవశాత్తు బావిలో పడి చెలగోల చిన్నదూడయ్య (45) మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. రోడ్డువెంట సైకిల్, చెప్పులు ఉండడంతో గమనించిన మాజీ సర్పంచ్ సరిత భర్త గణపారపు రమేష్ బావిలో గాలించి చిన్నదూడయ్య మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడికి భార్య సమ్మక్క, ఇద్దరు కుమారులున్నారు.

కొంత ఎక్కువ ఎంతో తక్కువ

మిశ్రమంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్

- దీర్ఘకాలిక ప్రాజెక్టులకు కానరాని మోక్షం
- కొన్ని పనులకు నిధుల కేటాయింపు
- నిర్మలమ్మ కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

హనుమకొండ, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన 2025 కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ ఆశించిన కేటాయింపులైతే లేవు. దీర్ఘకాలకంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల ఊసే లేదు. కొత్త రైల్వే ప్రాజెక్టులు, మార్గాల ప్రస్తావన కానరాలేదు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రకటన ఈసారి బడ్జెట్‌లో చోటుచేసుకోలేదు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కేంద్రం తన వంతుగా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తుందని వరంగల్‌వాసులు పడిన ఆశ నిరాశే అయింది. సైనిక్ స్కూల్ ఏర్పాటు ప్రస్తావన కూడా లేదు. ఎన్నో దశాబ్దాలుగా కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా కూడా ఈసారి బడ్జెట్‌లో కూడా హుళక్కే అయింది. ములుగులో ఏర్పాటవుతున్న కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి ప్రత్యేకంగా నిధులేవీ కేటాయించలేదు. మేడారానికి జాతీయ హోదా కల్పన ఈసారి కూడా కలగానే మిగిలింది. నగరంలో భూగర్భ డ్రైనేజీకి రూ.4,170 కోట్లు ఇవ్వాలని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను పీఎం మిత్రలో చేర్చి రూ.300 కోట్ల గ్రాంట్ ఇవ్వాలని, లెదర్‌పార్క్, సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని, కాజీపేట - భూపాలపల్లితో పాటు మూడు కొత్తలైల్వే లైన్లు, ప్రాజెక్టులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. జిల్లా ప్రజాప్రతినిధులు సైతం ఢిల్లీలో సంబంధిత శాఖల కేంద్ర మంత్రులను కలిసి వినతి పత్రాలను సమర్పించారు. వీటిలో వేటికీ బడ్జెట్‌లో చోటు దక్కలేదు.

ఆదాయపు పన్ను శ్లాబు పరిమితి పెంపు

ఉద్యోగులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ప్రకటనకు ఎట్టకేలకు ఈ బడ్జెట్‌లో మోక్షం కలిగింది. ఆదాయ పన్ను శ్లాబు పరిమితిని పెంచుతున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనతో ఉద్యోగుల్లో సంతోషం వ్యక్తం అవుతున్నది. ఇకపై రూ.12లక్షల వరకు ఆదాయ పన్ను ఉండదని స్పష్టం చేశారు. సవరించిన స్లాబ్‌ల ప్రకారం రూ.4లక్షల వరకు ఆదాయంపై ఎలాంటి పన్ను ఉండదు. బడ్జెట్‌లో సవరించిన స్లాబుల ప్రకారం మధ్య తరగతిపై పన్ను భారం గణనీయంగా తగ్గనున్నది. దీని వల్ల ఉమ్మడి జిల్లాలో ఉన్న సుమారు 18 లక్షల మంది మధ్య తరగతి వారికి లబ్ధి కలుగనున్నది.

రైతులకు చేయూత

బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డుల రుణ పరిమితిని పెంచడంతో రైతులకు ఆర్థికంగా చేయూత లభించినట్లయింది. రైతులకు తక్కువ వడ్డీకే రుణాలిచ్చే కిసాన్ క్రెడిట్ కార్డు రుణ పరిమితిని రూ.3లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచడం వల్ల ఉమ్మడి జిల్లాలో సుమారు 12 లక్షల మంది రైతులకు ప్రయోజనం సమకూరనున్నది. 1998లో ప్రవేశపెట్టిన కిసాన్ క్రెడిట్ స్కీమ్ కింద ఉమ్మడి జిల్లాలో లక్షలాది మంది రైతులు లబ్ధిపొందుతున్నారు. అయితే ఈ కార్డురుణ పరిమితిని కేంద్ర ప్రభుత్వం చాలాకాలం సవరించలేదు. ఈ పథకం కింద రైతులు 9 శాతం వడ్డీ రేటుతో రుణాలు తీసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం 2శాతం వడ్డీ రాయితీగా అందిస్తోంది. అదనంగా రైతులు తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించినట్లయితే రైతులు మరో 3 శాతం వడ్డీ రాయితీని పొందుతారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతులు రూ.360 కోట్ల మేరకు రుణాలు తీసుకున్నారు. కార్డు రుణ పరిమితిని రూ. 5లక్షలకు పెంచడంవల్ల రైతులు మరింత రుణం తీసుకునే వెసులుబాటు లభించనున్నది.

చిన్న పరిశ్రమలకు ఊతం

బడ్జెట్‌లో ఎంఎస్ఎంఈ, స్టార్టప్‌లకు ఊతం ఇస్తూ ప్రోత్సాహకాలు ప్రకటించడం వల్ల ఉమ్మడి జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఊతం లభించనున్నది. ప్రభుత్వం ఇచ్చే రాయితీతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు చిన్నతరహా పరిశ్రమలు స్థాపించేందుకు మరింత ముందుకు వచ్చే అవకాశం ఉంది. స్టార్టప్‌లకు రూ.20కోట్ల వరకు రుణాలు ఇవ్వనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలమ్మ ప్రకటించారు. అంకుర సంస్థలకు ప్రత్యేక క్రెడిట్ కార్డులు ఇస్తామని తెలిపారు. స్టార్టప్‌లకు ప్రోత్సాహకంగా రూ.5లక్షల పరిమితి కలిగిన క్రెడిట్ కార్డుల ఇవ్వనున్నట్టు, 10 లక్షల మందికి ఈ కార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మైక్రోస్కేల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ)లు 2,971 ఉన్నాయి. స్టార్టప్‌ల కోసం జిల్లా పరిశ్రమ కేంద్రాల్లో 712 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

గిగ్ వర్కర్లకు శుభవార్త

అసంఘటిత రంగాల ఉద్యోగులకు (గిగ్ వర్కర్లు) కేంద్రం శుభవార్త తెలిపింది. 2025 బడ్జెట్ ద్వారా వారికి గుర్తింపుతో పాటు ఆరోగ్య బీమా సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. దీని వల్ల ఉమ్మడి జిల్లాలోని 2.10 లక్షల మంది గిగ్ వర్కర్లకు మేలు కలుగనున్నది. ఈ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించనున్నట్టు ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల గిగ్ వర్కర్లకు గుర్తింపుకార్డులు లభిస్తాయి. అలాగే ప్రధాన మంత్రి ఆరోగ్య యోజన (పీఎం-జేఏవై) కింద ఉద్యోగికి, కుటుంబానికి ఏడాదికి రూ.5లక్షల దాకా ఆరోగ్య బీమా సదుపాయం అందుబాటులోకి రానున్నది. తాత్కాలికంగా తమకు ఉన్న వీలును బట్టి ఉద్యోగాలను చేసేవాళ్లను గిగ్ వర్కర్లు అంటారు. ప్రత్యేకించి యాప్‌ల ద్వారా సేవలందించే ఉద్యోగాల్లో ఎక్కువమంది ఉంటారు. డెలివరీ యాప్‌లు, రైడ్ యాప్‌లతో పని చేసే ఉద్యోగులతో పాటు ఫ్రీలాన్సర్లు, ఆన్‌లైన్ ట్యూటర్లు ఈ విభాగంలోకి వస్తారు. ఉమ్మడిజిల్లా ఈ తరహా ఉద్యోగులకు బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయంతో ఊరట కల్పించారు. ఈ ప్రోత్సాహకాల వల్ల ఉమ్మడి జిల్లాలో ఉన్న సుమారు లక్ష మంది గిగ్ వర్కర్లు మేలు జరగనున్నది.



ఉమ్మడి జిల్లాల్లో క్యాన్సర్ కేంద్రాలు

ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రతీ జిల్లాలో క్యాన్సర్ కేంద్రాలు ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ 200 జిల్లా కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ లెక్కన ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆరు జిల్లాల్లో రాబోయే రోజుల్లో క్యాన్సర్ ఆస్పత్రులు అందుబాటులో రానున్నాయి. ఈ యేడు వరంగల్ లేదా హనుమకొండ జిల్లాల్లో ఏదో ఒక దానిలో క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటయ్యే అవకాశం ఉంది. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో క్యాన్సర్ విభాగం ఉన్నప్పటికీ దాని ద్వారా క్యాన్సర్ రోగులకు పూర్తి స్థాయిలో చికిత్స అందడం లేదు. దీంతో వీరంతా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. జిల్లాకో కేన్సర్ కేంద్రం ఏర్పాటుతో క్యాన్సర్ రోగులకు ఊరట లభించినట్లవుతుంది.

విమానాశ్రయానికి మార్గం

కేంద్ర బడ్జెట్‌లో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు పెద్ద పీట వేశారు. పారిశ్రామిక, వ్యాపార, పర్యాటక రంగాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని దేశ వ్యాప్తంగా 150 విమానాశ్రయాల ఏర్పాటుకు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా మామునూరులో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్రం నుంచి నిధులు అందే అవకాశం ఉంది. ఇప్పటికే మామునూరు విమానాశ్రయ అభివృద్ధికి చర్యలు ప్రారంభమయ్యాయి. అదనంగా అవసరమైన స్థల సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కూడా ఇచ్చింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ విమానాశ్రయంగా అభివృద్ధి చేయడానికి కేంద్రం నుంచి నిధులు అందే అవకాశం ఉంది.

కొన్నింటికి మోదం

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేంద్ర బడ్జెట్‌లో కొంత మేరకు నిధుల కేటాయింపు జరిగినట్టు సమాచారం. అలాగే మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. లెదర్ ఉత్పత్తుల తయారీకి బడ్జెట్‌లో ప్రభుత్వం రాయితీలు ప్రకటించినందువల్ల ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న లెదర్ పార్కు జనగామ జిల్లాలో ఏర్పాటయ్యే అవకాశాలు కొంత మేరకు ఉన్నట్టు తెలుస్తోంది. బడ్జెట్‌లో వివిధ రంగాలకు ఇచ్చిన రాయితీలు, ప్రోత్సాహకాలు ఇతరత్రా వాటి వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 10 లక్షల మంది ప్రజల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి పొందే అవకాశం ఉన్నట్టు ఆర్థిక రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆదాయం పన్ను పరిమితి పెంపు వల్ల వరంగల్ జిల్లాలో సుమారు లక్షన్నర మందికి ప్రయోజనం కలుగనున్నది. మొత్తానికి బడ్జెట్ పట్ల అన్నివర్గాల ప్రజల్లో మిశ్రమ స్పందన వ్యక్తం అవుతోంది.

వికసిత్ భారత్‌కు బాటలు
రావు పద్మ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు



పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్ వికసిత్ భారత్‌కు బాటలు వేయవచ్చు. పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి ప్రధాని ఎల్ల వేళలా ముందుంటాడని అనడానికి ఈ బడ్జెట్‌తో నిరూపణ అయింది. ఉద్యోగులకు ఇన్‌కమ్ టాక్స్ పరిధి 12 లక్షలకు పెంచడం సంతోషకరమైన విషయం. స్వయం ఉపాధి పొందే యువతకు ఆవకాశాల్ని పెంచుతూ పరిశ్రమల స్థాపనకు రుణ పరిమితిని పెంచి చేయూతనిచ్చిన బడ్జెట్. ప్రాణాధర మందుల ధరలను తగ్గేలా నిర్ణయం తీసుకోవడం మోదీ ప్రభుత్వం మానవత దృక్పథానికి నిదర్శనం.

ప్రభుత్వ విద్యకు గ్యారెంటీ లేదు
కడారి భోగేశ్వర్, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి



దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి అరకొర నిధులే కేటాయించారు. 50.65 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యా రంగానికి 1,28,650 కోట్లు మాత్రమే కేటాయించారు. బడ్జెట్‌లో ఇది 2.53 శాతమే. గత బడ్జెట్ కంటే ఈ ఏడాది బడ్జెట్‌లో 0.03 శాతం నిధులు తక్కువగానే కేటాయించారు. ఇంత తక్కువ కేటాయింపులతో ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమవుతుంది. ప్రైవేటు విద్యా రంగానికి ఊతమిచ్చేదిగా ఉంది. కేంద్ర బడ్జెట్‌లో కనీసం 6 శాతం నిధులు కేటాయిస్తేనే విద్యా రంగాన్ని బలోపేతం చేయవచ్చు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి
సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి తీవ్ర అన్యాయం జరిగింది. తెలంగాణకు ప్రత్యేక కేటాయింపులు ఏమీలేవు. బిహార్ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి, ప్రత్యేక నిధుల కేటాయింపులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. తెలంగాణకు ఐఐఎం ఐజీటీ, సైనిక్ పాఠశాలలు, కేంద్ర విద్యాసంస్థలు రావాల్సి ఉండగా వాటిని పట్టించుకోలేదు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ముందడుగు వేయడంలో అవసరమైన నిధులను కేటాయించలేదు. ఓట్లు, సీట్లకు బీజేపీ ప్రథమ ప్రాధాన్యత ఇచ్చింది.

ఇది సంతులిత, వృద్ధి ఆధారిత బడ్జెట్
తిప్పర్తి రాఘవరెడ్డి, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్



కేంద్ర బడ్జెట్ సంతులిత, వృద్ధి ఆధారిత బడ్జెట్. బడ్జెట్‌లో ఆర్థిక వృద్ధి, మధ్య తరగతి ప్రజలకు పన్ను ఉపశమనం, వ్యాపార ప్రోత్సాహంపై ప్రధానంగా దృష్టి సారించింది. ప్రధాంగా రూ.12 లక్షల వరకు ఆదాయానికి పన్ను మినహాయింపు, మూలధన వ్యయం పెంపు, ఎంఎస్ఎంఈ, స్టార్టప్‌లకు మద్దతు, బీమా రంగంలో ఎఫ్‌డీఐ సంస్కరణలు ప్రధానంగా చెప్పుకోదగ్గవి. మధ్య తరగతి వేతన జీవులకు భారీ పన్ను ఉపశమనం కలిగించడం ముదావహం. అధిక మూలధన వ్యయం, దీర్ఘకాలిక ప్రోత్సాహం బడ్జెట్‌లో పాజిటివ్ అంశాలు. బడ్జెట్‌లో రైతులకు కొత్త పథకాలను ప్రవేశపెట్టడం, పీఎం ధన్ ధ్యాన్ కృషి యోజన ద్వారా 1.7 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరునున్నది. ఎంఎస్ఎంఈ, సహకార రంగాలకు రుణ సదుపాయాలను కల్పించడం వల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలు వృద్ధి చెందడానికి అవకాశం ఉంది.

అలరించిన సినీ సంగీత యుగళ గాన విభావరి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీసాయి మీరా కల్చరల్ సొసైటీ హనుమకొండ, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సినీ సంగీత గాయకుడు సింగర్ చోటు 101 మంది గాయనీమణులతో సినీ నేపథ్య గాయకుడు, గాన గంధర్వుడు దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తెలుగు సినిమా చిత్రాల్లో పాడిన పాటలు ఆద్యంతం అలరించాయి. కర్ణాటక సంగీత విద్వాంసులు ప్రొఫెసర్ వి.తిరుపతయ్య, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జూరీ మెంబర్, చీఫ్ కోఆర్డినేటర్ టీవీ అశోక్‌కుమార్, విశ్వకర్మ (సాయిమీర కల్చరల్ సొసైటీ చైర్మన్), కర్ణకంటి పోతనాచారి తదితరులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి గాన విభావరిని లాంఛనంగా ప్రారంభించారు. 101మంది గాయనీమణులతో ప్రధాన గాయకుడు చోటు సింగర్ 12గంటల పాటు నిర్విరామంగా సినీ సంగీత యుగళగాన విభావరిని నిర్వహించారు. కార్యక్రమంలో రావులకొలను రాంమూర్తి, రాపాక పులిగిళ్ల వెంకటపద్మావతి, మగ్దుం మొహియుద్దీన్ సహకారంతో విభావరిని బి. భువన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి గాయనీమణులు పాల్గొని తమ గానామృతాన్ని వినిపించి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు. అనంతరం గాయనీమణులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్లను నిర్వాహకులు ప్రదానం చేశారు.



సినీ యుగళ గీతాలను ఆలాపిస్తున్న గాయకుడు చోటు సింగర్

కోటా కోసం కొట్లాట!

- నేడు ఓరుగల్లులో బీసీ జంగ్ సైరన్
- ఆర్ట్స్ కాలేజీలో లక్ష మందితో బీసీ యుద్ధభేరి
- బహిరంగ సభకు రానున్న జాతీయ నేతలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

బీసీ ఉద్యమానికి పోరాటాల గడ్డ ఓరుగల్లు వేదికవుతోంది. బీసీల హక్కుల కోసం రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు ఒకే వేదికపైకి రాబోతున్నారు. ఆదివారం హనుమకొండ ఆర్ట్స్ కాలేజీలో లక్ష మందితో బీసీ యుద్ధభేరి సభను నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో పాటు జాతీయ బీసీ నేతలను ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే సభ ఏర్పాట్లను పూర్తి చేశారు. బీసీలను సభకు భారీగా తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహిస్తుండటం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

రిజర్వేషన్ల పెంపు

బీసీలకు రాజకీయ పార్టీలు ఇస్తున్న హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో బీసీ యుద్ధభేరి నిర్వహిస్తున్నారు. రిజర్వేషన్లలో తమ వాటా.. కోటా.. కోసమే యుద్ధభేరి మోగిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ప్రధానంగా గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీని అమలు చేసిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ పొలిటికల్ జేఏసీ డిమాండ్ చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేవలం 23 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారని, 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ విద్య, ఉద్యోగాల్లో ప్రస్తుతం ఉన్న 27 శాతాన్ని పెంచుకుంటూ పోవాలని బీసీ యుద్ధభేరి ప్రధాన డిమాండ్‌గా ఉంది. అలాగే రాష్ట్ర జనాభాలో 6.8 శాతమే ఉన్న అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూ ఎస్ కోటా కింద ఇచ్చిన పది శాతం రిజర్వేషన్ రద్దు చేయాలని మరో డిమాండ్‌ను తెరపైకి తీసుకు వస్తున్నారు. ఈడబ్ల్యూఎస్ కోటా వల్ల బీసీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారనే వాదనను వినిపిస్తున్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తరహాలోనే బీసీ అట్రాసిటీ చట్టం తీసుకురావాలనే డిమాండ్‌ను తెరపైకి తెస్తున్నారు. ఇప్పటికీ బీసీలపై చిన్నచూపు చూస్తున్నారని, కులం పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారని బీసీ నేతలు పేర్కొంటున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లను కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఈ 33 శాతం రిజర్వేషన్లలో బీసీ మహిళల వాటా ఎంతో తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని కోరుతున్నారు. వీటితో పాటు ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ బీసీలకు వివిధ సంక్షేమ పథకాల కోసం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీసీ యుద్ధభేరి సభకు సిద్ధమవుతున్నారు.


బీసీ యుద్ధభేరికి జాతీయ నేతలు

హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు జరిగే సదస్సుకు పొలిటికల్ జేఏసీ కన్వీనర్ సుందరాజ్ యాదవ్ నేతృత్వం వహిస్తుండగా, బిహార్ మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్ కుమార్తె, ఎంపీ మీసా భారతి, బీసీ ఉద్యమ నేతల బీపీ మండల్ మనుమడు సూరజ్ మండల్, డీఎంకే ఎంపీ విల్సన్‌తో పాటు సమాజ్‌వాదీ పార్టీ నేత ధర్మేంద్రయాదవ్ తదితరులను ఈ సభకు రప్పిస్తున్నారు. తెలంగాణ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, బస్వరాజు సారయ్య, బీఆర్ ఎస్ నేత, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యలతో పాటు మరికొంత మంది బీసీ నేతలను సభకు ఆహ్వానిస్తున్నారు. తెలంగాణలో జరుగుతున్న బీసీ యుద్ధభేరికి జాతీయ నేతలను ఆహ్వానించటం ద్వారా జాతీయ మీడియా దృష్టికి బీసీ ఉద్యమాన్ని తీసుకెళ్లే అవకాశం లభిస్తుందని భావిస్తున్నారు.

నేడు లక్ష మందితో బీసీ యుద్ధభేరి

పోరాటాల గడ్డ ఓరుగల్లు నుంచి మరో ఉద్యమం ప్రారంభమవుతోంది. రాజకీయాల్లో బీసీల హక్కులు, ప్రభుత్వాలు బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో ఆదివారం బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ మైదానంలో బీసీ యుద్ధభేరి సభను ఏర్పాటు చేశారు. లక్ష మందికి పైగా బీసీలను తరలించాలని ప్రణాళిక రూపొందించారు. వారం, పది రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బీసీ యుద్ధభేరిని విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

సభకు ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు



55.85% బీసీలు!

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన వివరాలతో నివేదికను రూపొందించారు. సమగ్ర కుల సర్వే వివరాల నివేదికను ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మంత్రివర్గ ఉపసంఘానికి అధికారులు అందజేయనున్నారు. ఆ నివేదికపై ఉపసంఘం అధ్యయనం చేయనుంది. 5న రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఆ సమావేశంలో బీసీ రిజర్వేషన్లపై చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు. అదే రోజు మధ్యాహ్నం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి, బీసీల రిజర్వేషన్లపై ఒక తీర్మానం చేసి.. దాన్ని కేంద్రానికి పంపనున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుతామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఆ మేరకు బీసీల రిజర్వేషన్లను పెంచేందుకు సర్కారు కసరత్తు చేస్తోంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ మేరకు రాష్ట్రంలో 50 శాతం రిజర్వేషన్లు మించకుండా, న్యాయపరమైన సమస్యలు లేకుండా ఉండేలా ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. కాగా, మార్చి 20 నాటికి రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలను పూర్తిచేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆ దిశగా పంచాయతీరాజ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపడుతున్నారు. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఎన్నికల నిర్వహణకు అవసరమైన కార్యాచరణ చేపడుతోంది. కుల సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరనుండడంతో ఎన్నికల అంశం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

బీసీ కమిషన్.. కుల సర్వే ఆధారంగా రిజర్వేషన్..



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, సీతక్క, రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం, సురేఖ, ఉత్తమ్, జూపల్లి, కోమటిరెడ్డి, ఎంపీ బలరామ్‌

తెలంగాణ ఏర్పాటైన తర్వాత అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే పేరుతో సర్వే చేపట్టింది. దాని ప్రకారం 2014లో బీసీలు 51శాతం, ఓసీలు 21, ఎస్సీలు 18, ఎస్టీలు 10 శాతం ఉన్నట్టు తేలింది. కానీ, ఈ సర్వేను అధికారికంగా విడుదల చేయలేదు. మళ్లీ 10 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇటీవల సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో కులం, మతం సహా అన్ని వివరాలను సేకరించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో ఎంతమేర రిజర్వేషన్లను కల్పించాలనే అంశంపై ప్రభుత్వం ఈ సర్వేను వినియోగించుకోనుంది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో బీసీల రిజర్వేషన్ల ఖరారు కోసం సర్కారు బీసీ కమిషన్‌తో పాటు, ప్రత్యేక కమిషన్‌ను కూడా ఏర్పాటు చేసింది. ప్రత్యేక కమిషన్ కూడా బీసీల రిజర్వేషన్లపై లోతుగా అధ్యయనం చేసింది. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిసింది. సర్వే వివరాలు, ప్రత్యేక కమిషన్ సూచనలను పరిగణనలోకి తీసుకొని.. స్థానిక ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లపై సర్కారు నిర్ణయం తీసుకోనుంది.

మంత్రులతో సీఎం భేటీ..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం అందుబాటులో ఉన్న మంత్రులు, ఉన్నతాధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్లో భేటీ అయ్యారు. బీసీలకు రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణపై చర్చించారు. సమావేశం అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ మీడియాతో మాట్లాడారు. పొన్నం మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వే, బీసీ కులగణనపై శాసనసభలో తీర్మానం చేసి, ప్రక్రియను పూర్తి చేశామని చెప్పారు. కులగణన కార్యరూపం దాల్చే అంశంపై సీఎం చర్చించారని తెలిపారు. దీంతోపాటు ఎస్సీ వర్గీకరణపై సబ్‌కమిటీ తీసుకున్న నిర్ణయాలపైనా చర్చించామన్నారు. ఈ నెల 5న సబ్ కమిటీ ఇచ్చిన నివేదికను క్యాబినెట్ ముందు పెడుతున్నారని, అదే రోజు శాసనసభలో చర్చించి ప్రజాస్వామ్య యుతంగా ముందుకు తీసుకెళతామని చెప్పారు.

వర్గీకరణపై త్వరలో నివేదిక: రాజనర్సింహ

సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన రెండు గంటల్లోనే ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ప్రకటన చేశామని, వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. దీనిపై ఇప్పటికే సానుకూలంగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గ ఉపసంఘం వేశారన్నారు. ఉపసంఘం సూచన మేరకు ఏక సభ్య కమిషన్‌ను నియమించామని.. ఈ కమిషన్ త్వరలో నివేదిక ఇవ్వబోతోందని తెలిపారు. దానిపై మంత్రివర్గంలో చర్చించి, అసెంబ్లీలో ప్రవేశపెడతామని చెప్పారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ముడుపుగల్‌లో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ మూర్తిప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం మూడోరోజు శనివారం పూజా కార్యక్రమాలు అంగరంగవైభవంగా నిర్వహించినట్లు ఆలయ నిర్మాణ బాధ్యుడు, మాజీ సర్పంచ్ యాస రమావెంకట్‌రెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రాభోదకి, 9 గంటలకు నిత్య హవనపారాయణములు, నూతన మూర్తులకు షోడశ కలశ స్నపనము, అలంకారము, హోమములు, నిత్యపూర్ణాముతి, మంగళశాసనము, తీర్థప్రసాదగోష్ఠి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివాస హోమములు, నిత్యపూర్ణాహుతి, మంగళ శాసనము, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించినట్లు తెలిపారు.

శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి


శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న రాష్ట్ర హైకోర్టు జడ్జీ, జస్టిస్ నంద

మహబూబాబాద్‌రూరల్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ శివారు అనంతాద్రి శ్రీస్వయంభూ శ్రీ వేంకటేశ్వరస్వామి రాష్ట్ర హైకోర్టు జడ్జీ, జస్టిస్ సూరెపల్లి నంద కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. స్థానిక దేవాలయం అర్చకుడు గొడవర్తి చక్రధరాచార్యులు సూరెపల్లి నంద కుటుంబసభ్యులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, శాలువా కప్పి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణల నడుమ పత్యేక పూజలుచేసి తీర్థప్రసాదాలను అందజేశారు. తొలుత మహబూబాబాద్ పర్యటనకు వచ్చిన నంద ఆర్నీ కన్వెన్షన్ హాల్‌లో విడిదిచేయగా, ప్రముఖదంత వైద్యనిపుణులు అనిల్‌గుప్తా- అరుంధతి దంపతులు మర్యాదపూర్వకంగా కలిసిపుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ నందను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. మహబూబాబాద్ జిల్లా కోర్టు జూనియర్ సివిల్ జడ్జీ తిరుపతి, ఏవో క్రాంతికుమార్, అమరేందర్, న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పోలెపల్లి శ్రీనివాస్, టీఎస్‌సీపీఎస్ ఈయూ రాష్ట్ర కార్యదర్శి ముబీన్ అహ్మద్, శ్రీనివాస్, స్వరూప. శివకుమార్, శైలోజ, సంతోష్, అనిల్‌కుమార్, డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపికారెడ్డి పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జీని కలిసిన కలెక్టర్

మహబూబాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్‌లో హైకోర్టు జడ్జీ సూరెపల్లి నందను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన నందాను జిల్లా కలెక్టర్ మర్యాద పూర్వకంగా కలుసుకుని, మొక్కను అందజేశారు.


నందాకు మొక్కను అందజేస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

నిరుద్యోగులతో చెలగాటమాడుతున్న కేంద్రం

• సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్


మాట్లాడుతున్న శ్రీనివాస్

ఇనుగుర్తి, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ, నిరుద్యోగులతో కేంద్రప్రభుత్వం చెలగాటమాడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ఆరోపించారు. ఇనుగుర్తిలో శనివారం సీఐటీయూ అనుబంధ కార్మికసంఘాల సదస్సును మండల కార్యదర్శి జల్లె జయరాజ్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ అధ్యక్షుడిగా అల్లపు రాములు, కార్యదర్శిగా మాలి జంపయ్య, కోశాధికారిగా పింగిళి శ్రీనులను ఎన్నుకున్నారు. సీఐటీయూ జిల్లాకార్యదర్శి కుంట ఉపేందర్, పార్టీ జిల్లా నాయకులు గునిగంటి రాజన్న, మార్తినేని పాపారావు, కుమ్మరికుంట్ల నాగన్న, సమ్మెట రాజమౌళి, గొడిశాల వెంకన్న, ఆవుల వెంకన్న, గంజి సంజీవరెడ్డి, బండి సత్యం, సోమయ్య పాల్గొన్నారు

ఇనుగుర్తిలో పోలీసుల అవగాహన

ఇనుగుర్తి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శనివారం సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా అంశంపై ప్రజలకు ఎస్ఐ మురళీధర్‌రాజ్ అవగాహన కల్పించారు. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపచేయాలి

సీపీఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాలిటీల పరిధిలో ఉన్న కూలీలందరికి ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింప జేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మునిసిపల్ 6వవార్డు పరిధి బేతోలు గ్రామంలో శనివారం సీపీఎంముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఆత్మీయ భరోసా పథకం ద్వారా గుంట భూమిలేని నిరుపేద కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని చెప్పి, 20 రోజులకు పైగా ఉపాధిహామీ పనులు చేసిన కూలీలు అర్హులని నిబంధన పెట్టడంతో మునిసిపాలిటీ పరిధిలోని కూలీలకు ఆ పథకం అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆ నిబంధనను సడలించి అర్హులైన కూలీలందరకి ఆత్మీయ భరోసా అందించాలని కోరారు. రుణమాఫీ కాని రైతులందరికి రుణమాఫీచేసి అన్నదాతలను ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దుడ్డెల రాంమూర్తి, బానోత్ వెంకన్న, రజాక్, యూసూబ్, రామన్న, నరేష్, రమేష్, శ్రీను, ఎల్లయ్య, నవీన్, భాస్కర్, బాబు మియా, యాకూబ్ పాల్గొన్నారు.

దాతృత్వానికి మారు పేరు కమ్మ కులస్థులు

● కమ్మ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్


సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రసాద్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : దాతృత్వానికి మారుపేరు కమ్మ కులస్థులని కమ్మ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో శనివారం కమ్మ సంక్షేమ సంఘం జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కమ్మకులస్థులు అన్నిరంగాల్లో ముందుకుసాగుతూ, సమాజంలో సేవా కార్యక్రమాలకు పెద్దపీట వేయాలని పిలుపునిచ్చారు. కమ్మకులస్థులు ఆడాప రవీందర్‌రావు, రత్నాకర్‌రావు, చంద్రశేఖర్‌రావు, శ్రీదేవి, మాధవరావు, నున్న రమణ, ప్రభాకర్‌రావు, లక్ష్మణ్‌రావు, నామాసైదులు, ఉపేందర్, రాజేష్, లెనిన్‌బాబు, శేషగిరిరావు, బాబు, వెంకటేశ్వరరావు, పాపారావు, మోహన్‌రావు, బిక్షమయ్య, కుటుంబరావు, శ్రీనివాస్‌రావు, సత్యనారాయణరావుతో పాటు గార్ల, బయ్యారం, డోర్నకల్, కురవి, మహబూబాబాద్ మండలాలకు చెందిన కులపెద్దలు హాజరయ్యారు.

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా సోమేశ్వర్


సోమేశ్వర్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న బండారు వెంకటరమణ

దంతాలపల్లి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా దంతాలపల్లికి చెందిన అంకం సోమేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు వెంకటరమణ తెలిపారు. శనివారం దంతాలపల్లిలో ఆయన మాట్లాడుతూ మండలశాఖ ప్రధాన కార్య దర్శిగా కుమ్మరికుంట్లకు చెందిన మంగీ రామూర్తిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైనవారు జిల్లా, మండల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కురవి పెరిక సంఘం నూతన కార్యవర్గం

కురవి, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి) : కురవి గ్రామ పెరిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బాజ సైదులు, గౌరవ అధ్యక్షులుగా సోమిశెట్టి శ్రీనివాస్, ఎర్ర నాగేశ్వర్‌రావు, ప్రధానకార్యదర్శిగా అవిరె మోహన్‌రావు, కోశాధికారిగా కానుగంటి సత్యనారాయణ, కార్యనిర్వహణ కార్యదర్శిగా నల్లపు రవి, ప్రచార కార్యదర్శిగా సంగెం నాగరాజు, ఉపాధ్యక్షులుగా బెడద వీరన్న, బాదె శ్రీనివాస్, గుమ్మల్ల సురేందర్, సహాయ కార్యదర్శులుగా బత్తిని రవి, తోట వెంకన్న, కట్ల కృష్ణయ్య, ముఖ్య సలహాదారులుగా కానుగంటి కృష్ణమూర్తి, మల్లయ్య, బెడద కృష్ణమూర్తి, బుదుమ వెంకన్న, బత్తిని నాగయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సంక్షిప్త వార్తలు

పోచంపల్లిలో యువతి అదృశ్యం

పెద్దవంగర, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోచంపల్లిలో ఓ యువతి (19) అదృశ్యమైన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం. పోచంపల్లి గ్రామానికి చెందిన పసునూరి సోమిరెడ్డి-విజయ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ద్వితీయ కుమార్తె పసునూరి శృతి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత సాధించకపోవడంతో కొంతకాలంగా ఇంటివద్దే ఉంటోంది. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాకపోవడంతో తండ్రి పసునూరి సోమిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో సునిల్‌కుమార్‌కు డాక్టరేట్



చిన్నగూడూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : జేఎన్టీయూ మంథని ఇంజనీరింగ్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న చిన్నగూడూరుకు చెందిన గాడిపెల్లి సునిల్‌కుమార్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టరేట్‌ను ప్రకటించింది. 'రిలేషన్ షిప్ బిట్ విన్ బాడి టైప్స్ అండ్ ఫిజికల్ ఫిట్‌నెస్ వేరియబుల్స్ అమాంగ్ ఇంజనీరింగ్ కాలేజ్ స్టూడెంట్స్ ఇన్‌వెస్ట్ తెలంగాణ' అనే పరిశోధన గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించినట్లు విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కృష్ణంరాజు తెలిపారు. సునిల్ ఈపరిశోధన ప్రొఫెసర్‌లు వెంకట్‌రెడ్డి, రాజేష్, లక్ష్మీకాంత్, సునిల్, దీప్లా, సిద్ధజగస్, సుప్రియ పర్యవేక్షణలో పూర్తి చేశాడు. ఈ సందర్భంగా మంథని కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ సునిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గవర్నర్‌ను కలిసిన హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను శనివారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సత్కరించారు. రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు.

టెన్త్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

● డీడీ దేశీరాంనాయక్

నెహ్రూసెంటర్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని గిరిజన సంక్షేమశాఖ మహబూబాబాద్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ దేశీరాంనాయక్ అన్నారు. మహబూబాబాద్ మండలం ముత్యాలమ్మగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం జిల్లాలోని వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులు, సీఆర్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఏడాది వందశాతం ఉత్తీర్ణత సాధించని పాఠశాలలను, అందులో పనిచేసే ఉపాధ్యాయులను గుర్తించి మెమోలు జారీ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా వందశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు 10/10 జీపీఏ ఎక్కువ మంది విద్యార్థులు సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. సమావేశంలో పొడుగు నర్సయ్య, బానోత్ కిషన్‌నాయక్, రామ్మూర్తి, శంకర్, పద్మ, అనిత పాల్గొన్నారు.

'సభను విజయవంతం చేయాలి'

గార్ల, ఫిబ్రవరి 01 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలని కోరుతూ న్యూ డెమొక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 20న హైదరాబాద్ జరిగే ప్రదర్శన, సభను విజయవంతం చేయాలని న్యూ డెమొక్రసీ మండల నాయకుడు గౌని మల్లేశ్ కోరారు. శనివారం మండలం పరిధిలోని మద్దివంచలో న్యూ డెమొక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20న చలో హైదరాబాద్ గోడ ప్రతులను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుసిని బాబురావు, ముళ్ల రంగయ్య, గౌని భద్రయ్య, శ్రీను, శ్రీరాములు, కృష్ణవెంకన్న పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్‌వైర్ అపహరణ

సీరోలు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కాంపల్లిలో గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌పార్మర్‌ను పగలగొట్టి, అందులో ఉన్న కాపర్‌వైర్‌ను అపహరించుకుపోయినట్లు ఎస్సై నగేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న సోమన్న అనే రైతు పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను శనివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి అందులో ఉన్న కాపర్‌వైర్‌ను అపహరించుకుపోయినట్లు పేర్కొన్నారు. రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

నీటి ఎద్దడిపై ప్రత్యేక ప్రణాళిక : ఎంపీడీవో

దంతాలపల్లి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడిపై ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో వివేక్‌రాం అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ బొడ్లాడ, తేజా తండా, దంతాలపల్లిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా రక్షిత మంచినీటి బావులు, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను పరిశీలించామన్నారు. మండల పరిధిలో ఎక్కడైనా తాగునీటి కొరతఉంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రదీప్‌నాయక్, ఎంపీవో మహ్మద్ అఫ్సరపాష, పంచాయతీ కార్యదర్శి ఏశబోయిన వెంకన్న పాల్గొన్నారు.


కొత్తగూడలో మార్కండేయ జయంతిలో పాల్గొన్న పద్మశాలీలు


శ్రీభక్తమార్కెండేయ ఆలయం పూజలో పాల్గొన్న కమిటీ బాధ్యులు

భక్తిశ్రద్ధలతో శ్రీభక్తమార్కండేయ జయంతి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీభక్తమార్కండేయ ఆలయంలో శనివారం జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించి వ్యాఘ్రపతాక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కైరంకొండ వీరన్న, కోశాధికారి వడ్డెపల్లి రాజేందర్, పద్మశాలి కులపెద్దలు గద్దె రవి, కోమాకుల రాజేశ్వర్‌రావు, అనుమాల వెంకటేశ్వర్లు, ముల్క కృష్ణమూర్తి, కస్తూరి శ్రీను పాల్గొన్నారు.

కొత్తగూడలో..

కొత్తగూడ, (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ మండల కేంద్రంలో శనివారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కుసుమ రాజన్‌బాబు, గుల్లపల్లి శ్రీను, మహేందర్, పూల యాదగిరి, సామల నాగరాజు, మెరుగు శ్రీను, వెలదండి వేణు, తాటి శ్రీనివాస్, దిండి రవి తదితరులు పాల్గొన్నారు.

బాగా పనిచేసినా ఇబ్బంది పెడుతున్నారు

● ఎమ్మెల్యే ఎదుట కంటతడిపెట్టిన గురుకులం ప్రిన్సిపాల్ ● బ్లాక్‌మెయిల్‌ను సహించేది లేదు : మురళీనాయక్


ఎమ్మెల్యే మురళీనాయక్ ఎదుట కంటతడి పెడుతున్న ప్రిన్సిపాల్

కేసముద్రం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : 'ఎంతబాగా పనిచేసినా కొంతమంది కావాలనే ఇబ్బందులు పెడుతున్నారు సార్' అని ప్రిన్సిపాల్ సుజాత రోదించారు. కేసముద్రం గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను శనివారం మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ తనిఖీ చేశారు. వంటగదిలో ఆహార పదార్థాలు, భోజనం నాణ్యత పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి గురుకులంలో భోజనం నాణ్యతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 400 మంది విద్యార్థులు భోజనం చేయగా అందులో ఒక్క విద్యార్థిని బయటి ఆహారం తినడం వల్ల అస్వస్థతకు గురైతే హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగిందని కొంతమంది కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని రోదిస్తూ తెలిపారు. దీంతో ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ విధులు సక్రమంగా నిర్వహించాలని, తప్పుడు ప్రచారంతో ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తూ బ్లాక్‌మెయిల్ చేసేవారిని సహించేది లేదన్నారు. హాస్టల్లో సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం ఇంటికన్నెలో సురాంబ కంతమహేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, ఆర్‌టీఏ సభ్యుడు రావుల మురళి, మార్కెట్ కమిటీ సభ్యుడు ఎండీ.అయూబ్‌ఖాన్, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, దయాకర్, కొండ సురేష్, వేముల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రైల్వే అండర్‌పాస్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సిగ్నల్‌కాలనీ వద్ద శనివారం రైల్వే అండర్‌పాస్‌ను స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పరిశీలించారు. పట్టణంలో రైల్వే మూడవ లైన్ పనుల నేపథ్యంలో రైల్వే అండర్‌బ్రిడ్జీ(ఆర్యూబీ) నుంచి వాహన రాకపోకలను నిలిపివేశారు. ఈక్రమంలో వాహనదారుల ఇబ్బందులను తొలగించేందుకు సిగ్నల్ కాలనీ సమీపంలో ఉన్న రైల్వే అండర్ పాస్ పునరుద్ధరణకు అధికారులు మరమ్మతు పనులు చేస్తున్నారు. సదరు రైల్వే అండర్ పాస్‌ను ఎమ్మెల్యే మురళీనాయక్ పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి అండర్‌పాస్‌ను వాహనదారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కాంగ్రెస్ నాయకులు మారదబోయిన యాకన్న, శంతన్‌రామరాజు, దండెం వెంకన్న, సల్వాది దిలీప్, పద్మం ప్రవీణ్, సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ల వీరయ్య పాల్గొన్నారు.

సోనియా గాంధీ క్షమాపణ చెప్పాలి

• బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాంబాబు


సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రపతి ద్రౌపదిముర్ముపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాంబాబు డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అట్టడుగు వర్గాల నుంచి ఎన్నో కష్టనష్టాలను అధిగమిస్తూ దేశ అత్యున్నతస్థాయికి ఆదివాసీ మహిళ ఎదగడం కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేక పోతుందన్నారు. ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు, రమేష్, జహేందర్, ఉపేందర్ పాల్గొన్నారు.

సాగు భూములను పంపిణీ చేయాలి

కేసముద్రం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం రెవెన్యూ గ్రామ పరిధిలోని 399/1, 349/3లోని 85 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో సాగు చేసిన వారికి పంపిణీ చేయాలని ఎంసీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు మర్రిపెల్లి మొగిళి డిమాండ్ చేశారు. ఈ మేరకు కేసముద్రం తహసీల్దార్ దామోదర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1994లో సుమారు 50 మంది రైతులు ఈ భూములను సాగు చేశారని, ఆ తర్వాత అటవీశాఖాధికారులు తమను ఖాళీ చేయించారని తెలిపారు. వాస్తవానికి ఆ భూములు రెవెన్యూశాఖకు చెందినవని, గతంలో సాగు చేసిన రైతులకు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉల్లి ప్రతాప్, రాజేశ్వర్‌రావు, పత్తి సాయిలు, మాదగోని వెంకన్న, ఎండీ.షైబు, నరసింహులు, దయ్యాల కుమారస్వామి, గణేష్, వినోద్ పాల్గొన్నారు.

అత్యాచారం చేసిన నిందితుడు అరెస్టు

నెల్లికుదురు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఓ మహిళను అత్యాచారం చేసిన కేసులో నిందితున్ని శనివారం అరెస్టు చేసినట్లు తొర్రూరు సీఐ గణేష్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ నిందితుడి వివరాలు వెల్లడించారు. భూక్య దాన్య తండాకు చెందిన భూక్య దేషిలాల్ నాలుగునెలల క్రితం ఓ జిల్లాకు చెందిన మహిళను వ్యవసాయ పనుల కోసం తన ఇంటివద్ద పాలేరుగా పెట్టుకున్నాడు. ఈ క్రమంలో జనవరి 29న ఆమె వ్యవసాయ పనుల కోసం వెళ్లగా దేషిలాల్ మహిళపై అత్యాచారానికి పాల్పడ్డాడు. గతనెల 30 మహిళ నెల్లికుదురు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సీహెచ్.రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మార్పును కోరుకుంటున్నారు : కాంగ్రెస్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు అధికార మార్పు కోరుకుంటున్నారని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సీమపురి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు తిప్పర్తి శ్రీధర్ అన్నారు. ఢిల్లీలోని సీమపురి అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రాజేష్ తిలోతీయ తరపున శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఢిల్లీలో పదేళ్ల ఆమ్‌ఆద్మీ పాలనలో ప్రజలు విసిగిపోయారని చెప్పారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అది రాహుల్‌గాంధీ ద్వారానే సాధ్యమని భావిస్తున్నారని పేర్కొన్నారు. కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల తరహాలో ఢిల్లీలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు.

'బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి'

తొర్రూరు, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి జి.మురళీధర్ అన్నారు. శనివారం చైల్డ్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరం ఆధ్వర్యంలో తొర్రూరులోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో 'బాలల భద్రత, సామాజిక బాధ్యత' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఫోరం జిల్లా అధ్యక్షుడు డి.కుమారస్వామి అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడారు. ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.దేవేందర్ రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ముత్తినేని జయప్రకాశ్, సెక్రెటరీ కేతిరెడ్డి నరేష్, మండల అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్, కరస్పాండెంట్ అనుమాండ్ల దేవేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు మంచి వైద్యం అందించాలి

దంతాలపల్లి (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక కేంద్రానికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి మురళీధర్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రిజిష్టర్లను పరిశీలించారు. ఆస్పత్రిలో అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని ఆయన అన్నారు. వైద్యులు చైతన్య, కవిత, హెల్త్‌విజిటర్స్ ఫార్మసిస్టు, ఏఎన్ఎంలు, స్టాఫ్‌నర్సు పద్మ పాల్గొన్నారు.

కురవి బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పిస్తాం

● కిసాన్ పరివార్ సీఈవో వివేక్

● వీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు

కురవి, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీవీరభద్రస్వామి వెలసిన కురవిలోని బస్టాండ్‌కు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారని, వారి కోసం కురవి బస్టాండ్‌లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించనున్నట్లు కిసాన్‌పరివార్ సీఈవో వివేక్ తెలిపారు. శనివారం కురవి వీరభద్రస్వామి దేవా లయంలో ప్రత్యేకపూజలు జరిపిన అనంతరం కురవి బస్టాండ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ వీరభద్రస్వామి మహా శివరాత్రి జాతరకు ముందే తమ స్వంత ఖర్చులతో బస్టాండ్‌లో ఫ్యాన్‌లు, కూర్చునేందుకు బల్లాలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇంకా ఏవిధమైన అవసరాలు ఉన్నా తమ సంస్థ ద్వారా చేస్తామని వెల్లడించారు. మహాశివరాత్రి జాతరకు భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ప్రజాప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమానాయక్, కిసాన్ పరివార్ మండలాల కో ఆర్డినేటర్లు గుగులోత్ శివవర్మ, విష్ణునాయక్, ఎడెల్లి వెంకన్న, వెంకటేశ్వర్లు, గణేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఒలింపియాడ్‌లో ఐదో స్థానం

కేసముద్రం, ఫిబ్రవరి 1 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో తెలంగాణ ఎస్‌సీఈఆర్‌టీ, ఎల్టా సంయుక్తంగా నిర్వహించిన ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఒలింపియాడ్‌లో కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని మహ్మద్ ఆఫ్రానికత్ ఉపన్యాస పోటీల్లో ఐదో స్థానం సాధించినట్లు హెచ్‌ఎం బందెల రాజు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో విద్యార్థినిని, గైడ్ టీచర్ శ్రీనివాసులును ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పీడీఎస్‌యూ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి1 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి సాంబు శనివారం ప్రకటించారు. మానుకోటలో జనవరి 31న నిర్వహించిన సంఘం జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా నవీన్, ప్రధానకార్యదర్శిగా బానోతు దేవేందర్, ఉపాధ్యక్షుడుగా ప్రకాష్, సహాయకార్యదర్శిగా వినోద్, కోశాధికారిగా నూతన్, కార్యవర్గసభ్యులుగా హన్మంతు, సాగర్, రాంబాబు. సౌజన్య, సందీప్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.